
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
మంగళవారం 30 జనవరి 2024



చిత్తూరు అసెంబ్లీ సీటుకు టీడీపీలో పెరిగిన పోటీ




కటారి హేమలత - చంద్రప్రకాష్



గురజాల జగన్మోహన్




కాజూరు బాలాజి - సీఆర్ రాజన్

● గురజాల జగన్మోహన్‌కు మెరుగైన అవకాశాలు?

చిత్తూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయ వాతావరణంలో వేగవంతంగా మార్పులు సంభవిస్తున్న నేపథ్యంలో చిత్తూరు అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్నవారి సంఖ్య టీడీపీలో పెరిగింది. వైసీపీలో సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కాదని విజయానందరెడ్డి పేరు ఖరారైన తర్వాత టీడీపీలో జోష్ మరింత పెరిగింది. ఎర్ర చందనం స్మగ్లర్ అనే ముద్ర బలంగా ఉండడం, సిటింగ్ ఎమ్మెల్యే సామాజికవర్గం తీవ్ర అసంతృప్తితో ఉండడం వంటి కారణాలతో గెలుపు ధీమాతో టీడీపీ ఉంది. ఇది ఆశావహుల మధ్య పోటీని పెంచింది. అయితే టికెట్ ఎవరికి ఇచ్చినా ఐక్యంగా ఉండి సహకరించాలనే ఒప్పందంతో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆరుగురు ఆశావహులతో బృందాన్ని ఏర్పాటుచేసి ఈనెల 21 నుంచి ఇంటింటి ప్రచారం కూడా ప్రారంభించారు.

చిత్తూరు నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న వారిలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గీర్వాణి భర్త చంద్రప్రకాష్, మాజీ మేయర్ హేమలత, జీజేఎం ట్రస్టు చైర్మన్ గురజాల జగన్మోహన్ నాయుడు పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. నిజానికి తొలుత ప్రధానంగా వినిపించిన పేరు డీకే ఆదికేశవుల నాయుడి కుమారుడు డీఏ శ్రీనివాస్. వచ్చే ఎన్నికల్లో బరిలో ఉంటానని ఈయన ప్రకటించి, జనవరి 1న స్వగృహంలో విందు కూడా ఏర్పాటుచేశారు. ఆ తర్వాత ఇప్పటి దాకా ఆయన ఏ పార్టీ నుంచి అనేది తేల్చుకోలేదు. అటు వైసీపీ, ఇటు టీడీపీ నాయకులను కలిసిన తర్వాత ఆయన పోటీకి అంతగా ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. ఇక, తిరుచానూరు మాజీ సర్పంచి సీఆర్ రాజన్ పేరు కూడా వినిపించింది. వన్యకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ఆయనకు అవకాశం ఇస్తే చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో అధికంగా ఉన్న ఆ వర్గం ఓట్లు టీడీపీకి అనుకూలమవుతాయని అంచనా. అయితే నాన్‌లోకల్ అనే ఫీలింగ్ తెరపైకి వస్తుందని అధిష్ఠానం ఇతడి విషయంగా పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. చిత్తూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాజూరు బాలాజీ కూడా చిత్తూరు అభ్యర్థిత్వం ఆశిస్తూ ఉన్నా టీడీపీ అధిష్ఠానం మొగ్గు గురజాల జగన్మోహన్‌పై ఉన్నట్టు ప్రచారం అవుతోంది.

దీటైన అభ్యర్థిగా గురజాల

నియోజకవర్గంలో విపరీతంగా ఖర్చు చేస్తున్న విజయానందరెడ్డిని ఢీకొనే ఆర్థిక స్తోమత ఉండడం, అదే స్థాయిలో జనాల్లోకి వెళ్లగలగడం గురజాల అనుకూలాంశాలు అంటున్నారు. చిరు వ్యాపారులకు వందల సంఖ్యలో తోపుడు బండ్లు ఉచితంగా ఇవ్వడం, ఇబ్బందులున్న వారికి ఆర్థిక సాయం చేయడం, శ్మశాన వాటికకు బర్నింగ్ మిషన్ వితరణ చేయడం, నియోజకవర్గంలోని 50 వేల కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంచడం వంటి సేవా కార్యక్రమాలతో తక్కువ సమయంలోనే ఈయన చిత్తూరు నగరంలో జనానికి దగ్గరయ్యారు. రకరకాల సర్వేలు, సమాచారం తెప్పించుకున్న తర్వాత పార్టీ అధినేత ఈయన పట్ల సానుకూలంగా ఉన్నారని చెబుతున్నారు. అయితే సీట్లవారీగా పొత్తులు ఖరారైన తర్వాత గానీ అధికారికంగా ఎవరు టీడీపీ అభ్యర్థి తేలే అవకాశాలు లేవు.

ఎంపీ సీటు కోసం నటుడు సప్తగిరి ప్రయత్నాలు




సినీ నటుడు సప్తగిరి పేరు చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా ప్రచారంలోకి వచ్చింది. ఆయన పూతలపట్టు ఎమ్మెల్యే టికెట్ కోసం కూడా ప్రయత్నాలు చేశారు. సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అండదండలు ఈయనకు ఉన్నాయంటున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే టికెట్ జర్నలిస్టు మురళీమోహన్‌కు ఖరారైనందున సప్తగిరికి చిత్తూరు ఎంపీ సీటు ఇస్తారని అంటున్నారు. సప్తగిరితోపాటు రక్షణ శాఖలో ఎస్పీ హోదాలో రిటైరైన చిన్నస్వామి (జీడీనెల్లూరు నియోజకవర్గం) కూడా ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం అవుతోంది. చిత్తూరు ఎంపీ స్థానం కుప్పం మెజార్టీ కారణంగా నిత్యం టీడీపీనే దక్కించుకునేది. 2019 ఎన్నికల్లో కుప్పం అసెంబ్లీ మాత్రమే టీడీపీకి దక్కడంతో చిత్తూరు ఎంపీ స్థానాన్ని కూడా కోల్పోవాల్సి వచ్చింది. ఈసారి చిత్తూరు ఎంపీ స్థానాన్ని గెలుచుకుంటామనే ధీమా పార్టీలో బలంగా ఉంది.




E 592 SPO1844182
ఓటరు పేరు : బి.బెంగుళూరప్ప
తండ్రి పేరు: బి అంజప్ప
ఇంటి సంఖ్య : 2-45/2
DELETED

ఓటర్లజాబితాలో తొలగించినట్లు చూపెడుతున్న బెంగళూరప్ప పేరు



166 SPO1841238
ఓటరు పేరు : మునెమ్మ ఎ
భర్త పేరు: వెంగప్ప ఎ
ఇంటి సంఖ్య : 1-5/2
వయస్సు : 54 లింగము : స్త్రీ
Died

మృతిచెందినా ఓటర్ల జాబితాలో తొలగించకుండావున్న మునెమ్మ పేరు



308 SPO0193292
ఓటరు పేరు : కె దేవమ్మ
భర్త పేరు: కె సుబ్రమణ్యం
ఇంటి సంఖ్య : 1-9/2
వయస్సు : 38 లింగము : స్త్రీ
Died

మృతిచెందినా ఓటర్ల జాబితాలో తొలగించకుండావున్న దేవమ్మ పేరు

బతికున్నోళ్ల ఓటు తీసేశారు


● జాబితాలో మృతుల పేర్లు అలాగే

బైరెడ్డిపల్లె, జనవరి 29: బతికి ఉన్న వారి ఓటు తీసేశారు. మరణించిన వారి ఓట్లను అలాగే ఉంచారు. ఇలా బైరెడ్డిపల్లె మండలంలో ఓటర్ల తుది జాబితాకు సంబంధించి పలుచోట్ల తప్పులు ఉండటంపై విపక్షాలు.. ఓటు కోల్పోయిన వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పాతూరునత్తం పంచాయతీకి సంబంధించి ఓటర్ల జాబితాను పరిశీలిస్తే.. పాతూరునత్తం గ్రామానికి చెందిన బెంగళూరప్ప (వరుస సంఖ్య 592) పేరును జాబితాలో తొలగించినట్లు చూపెట్టారు. గ్రామంలో ఉన్న ఆయన పేరును ఎందుకు తొలగించారో అర్థం కాని పరిస్థితి.

● మిట్టకురప్పల్లె గ్రామానికి చెందిన దేవమ్మ(308), మునెమ్మ(166) మృతిచెందారు. వీరిద్దరి పేర్లు మాత్రం జాబితా నుంచి తొలగించలేదు. ఇలాంటి తప్పిదాలు మిగిలిన పంచాయతీల్లోనూ వున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుది ఓటర్లజాబితాలోని ఇలాంటి తప్పిదాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

డబుల్ ఎంట్రీలు అలాగే..

చౌడేపల్లె, జనవరి29 : చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీలో చాలావరకు డబుల్ ఎంట్రీలను తొలగించలేదు. 87వ పోలింగ్ కేంద్రంలో ఎ.గణపతి నాయుడికి (టీవీఎఫ్0298695) ఓటు ఉంది. తండ్రి పేరు కృష్ణప్పగా నమోదైంది. 88వ పోలింగ్ బూత్‌లో (జీఎంసీ2947745) ఎ.గణపతి, తండ్రిపేరు కృష్ణగా ఓటు ఉంది. ఇలా రెండు చోట్లా ఓట్లు కొనసాగుతూనే ఉన్నాయి.



429 TVF0298695
ఓటరు పేరు : ఎ గణపతి నాయుడు
తండ్రి పేరు: కృష్ణప్ప
ఇంటి సంఖ్య : 11-130
వయస్సు : 34 లింగము : పు

314 GMC2947745
ఓటరు పేరు : ఎ గణపతి
తండ్రి పేరు: కృష్ణ
ఇంటి సంఖ్య : 7-2
వయస్సు : 42 లింగము : పు

87, 88 పోలింగ్ కేంద్రాల్లోని రెండు జాబితాల్లోనూ ఓటున్న గణపతినాయుడు



67 TVF1003672
47 GMC1589503 DELETED
70 TVF1256833
60 TVF1534734
73
53

87వ బూత్‌లో ఓటున్న సురేష్‌బాబు గొన్లితీ - 88వ బూత్‌లో సురేంద్రబాబుగా ఓటు

ఫొటో ఒకటి.. పేర్లు వేరు

దిగువపల్లె పంచాయతీ ఆర్‌ఆర్‌కాలనీకి చెందిన వ్యక్తికి సురేష్‌బాబు గొన్లితీ పేరిట 87వ పోలింగ్ కేంద్రంలో (టీవీఎఫ్ 1256833) ఓటు ఉంది. తండ్రి పేరు నాగప్ప గొన్లితీ అని ఉంది. అలాగే 88వ బూత్ (టీవీఎఫ్1534734)లో సురేంద్రబాబు, తండ్రి పేరు నాగరాజు పేరిట ఉన్న ఓటుకూ సురేష్‌బాబు ఫొటో ఉంది. రెండు ఓట్లకు ఒక ఫొటోపెట్టారా?లేదా ఒకరికే రెండు పేర్లతో ఓట్లున్నాయా అనేది తేలాలి.

ఓటర్ల జాబితాలో తప్పిదాలపై కసరత్తు



పులిచెర్ల తహసీల్దారు కార్యాలయంలో ఓటర్ల జాబితా తప్పిదాలపై కసరత్తు చేస్తున్న బీఎల్వోలు

కల్లూరు, జనవరి 29: పులిచెర్ల మండలంలోని ఓటర్ల తుది జాబితాలోనూ అనేక తప్పులు వెలుగు చూశాయి. మృతుల పేర్లు, జీరో డోర్ నెంబర్లు, డబుల్ ఎంట్రీలు, ఊరొదిలి వెళ్లిన ఓటర్లు, మహిళలకు పుట్టింట్లో ఓట్లు, అక్షరాల్లో తప్పులు,వేర్వేలు పోలింగ్‌స్టేషన్లలో ఓట్లు ఉన్నాయి. ఈ తప్పులన్నీ వెలుగు చూడటంతో క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక అందించాలని తహశీల్దార్‌ను జేసీ శ్రీనివాసులు ఆదివారం ఆదేశించారు. దీంతో పులిచెర్ల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండలంలోని బీఎల్ఓలు ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పిదాలపై కసరత్తు చేపట్టారు. జాబితాలోని మృతులు, డబుల్ ఎంట్రీలు, జీరో డోర్ నెంబర్లు, అక్షరాల్లో తప్పులు తదితర పొరబాట్లను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

ఆ తప్పులను ఫామ్-7లో నమోదు చేయండి

పులిచెర్ల మండలానికి చెందిన ఓటర్ల జాబితాలోని తప్పులపై వెంటనే ఫామ్-7లో నమోదు చేసి నివేదికలు సమర్పించాలని జేసీ శ్రీనివాసులు బీఎల్వోలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. అన్ని పోలింగ్‌స్టేషన్‌లలో బీఎల్‌ఓల ద్వారా ఓటర్లజాబితాను పరిశీలించామని, తప్పిదాలను గుర్తించి ఫామ్-7ద్వారా అప్‌లోడ్ చేశామని అధికారులు జేసీకి వివరించారు. అంతకు ముందు నియోజకవర్గం తహసీల్దారు శేషగిరిరావుతో కలిసి ఈఆర్వో ప్రభాకర్‌రెడ్డి బీఎల్వోలతో సమీక్షించారు. ఓటర్ల జాబితా తప్పిదాలపై పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏవో సుగుణమ్మ, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

చిత్తూరు ఎస్పీగా జాషువా

● కౌంటర్ ఇంటెలిజెన్సు సెల్ ఎస్పీగా రిషాంత్‌రెడ్డి.. తిరుపతి టాస్క్‌ఫోర్సు అదనపు బాధ్యతలు కూడా



జాషువా

చిత్తూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త ఎస్పీగా జాషువా రానున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాల పునర్విభజన తర్వాత చిత్తూరు ఎస్పీగా రిషాంత్‌రెడ్డి 2022 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టారు. సుమారు 22 నెలల పాటు పనిచేసిన ఆయన.. అంతకుముందు ఎస్‌ఈబీ ఏఎస్పీగా కూడా పనిచేశారు. జూన్ ఒకటో తేదికి రిషాంత్‌రెడ్డి ఎస్పీగా, ఏఎస్పీగా మూడేళ్ల పూర్తి కానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆయనకు బదిలీ తప్పలేదు. కౌంటర్ ఇంటెలిజెన్సు (సీఐ) విభాగ ఎస్పీగా రెగ్యులర్‌గా, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతల్ని ఈయనకు ప్రభుత్వం అప్పగించింది.

నాడు పలమనేరు డీఎస్పీ.. నేడు ఎస్పీ

ప్రస్తుతం కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న జాషువా జిల్లాకు బదిలీ అయ్యారు. 2009 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన ఈయన 2016 బ్యాచ్ ఐపీఎస్‌గా పరిగణించబడుతున్నారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఈయన ఒకే గ్రూప్-1 బ్యాచ్ అధికారులు. 2012-13 మధ్యకాలంలో జాషువా పలమనేరు డీఎస్పీగా పనిచేశారు. తల్లిదండ్రులది విజయవాడ అయినప్పటికీ, ఆయన పుట్టి పెరిగిందంతా హైదరాబాదులోనే.

పలు వివాదాల్లో రిషాంత్‌రెడ్డి



బదిలీ అయిన ఎస్పీ రిషాంత్ రెడ్డి అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు ప్రతిపక్షాల నుంచి బలంగా ఎదుర్కొన్నారు. గతేడాది జనవరి 4వ తేదీన చంద్రబాబు కుప్పంలో పర్యటించకుండా ప్రభుత్వ జీవో 1 పేరుతో పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ప్రచార రథం సీజ్ చేయడంతో పాటు సభలు ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడంతో నియోజకవర్గమంతా రథం లేకుండానే మాట్లాడారు. రోడ్లపై కింద కూర్చొని నిరసన తెలిపారు. అలాగే, లోకేశ్ యువగళం పాదయాత్రను జనవరి 27న కుప్పం నుంచి ప్రారంభించగా అనుమతులు ఇవ్వడంలో ఇబ్బందులు పెట్టారు. పాదయాత్ర సాగినన్ని రోజులూ నిత్యం కేసులు పెడుతూ పోలీసులు అడ్డుపడ్డారు. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పుంగనూరులో పర్యటించకుండా పోలీసులు అడ్డుకోవడం, టీడీపీ శ్రేణులు తిరగబడటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో పుంగనూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని మిగిలిన ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు సుమారు 600 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపించారు. కుప్పం నియోజకవర్గంలోనూ మహిళా నేతలు సహా అత్యధికంగా నేతలు, కార్యకర్తల మీద హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వీటన్నింటికీ ఎస్పీ రిషాంత్ రెడ్డినే కారణమని టీడీపీ నాయకులు అనేకమార్లు ఆరోపించారు. లోకేశ్ అయితే జిల్లా దాటిన తర్వాత కూడా ఎస్పీ రిషాంత్ రెడ్డి గురించి పలుమార్లు వ్యతిరేకంగా మాట్లాడారు.

సర్పంచులూ.. విద్యుత్ బకాయిలు చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: జిల్లాలోని పంచాయతీల విద్యుత్ బకాయిలను పెండింగ్ లేకుండా మార్చి నెలాఖరులోగా చెల్లించాలంటూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు డీపీవో ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు టైడ్, అన్‌టైడ్, వడ్డీ పైకం రూ.29.21 కోట్లు విడతల వారీగా జమయ్యాయి. పంచాయతీల్లో వీధిలైట్లు, తాగునీటి పథకాల మోటర్ల విద్యుత్ వినియోగానికి సంబంధించి రూ.600 కోట్ల మేర బకాయిలున్నట్లు విద్యుత్ అధికారులు ఇప్పటికే పంచాయతీలకు నోటీసులు జారీ చేశారు. మరోవైపు జిల్లా పంచాయతీ అధికారులు కూడా 2023 ఏప్రిల్ ఒకటో తేది నుంచి ఇప్పటివరకు చెల్లింపులు పోను మిగులు విద్యుత్ బకాయిలను విద్యుత్ అధికారులతో సంప్రదించి చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసుల జారీ పట్ల సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. గతంలో 13, 14 ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ బకాయిలకు జమచేయగా, ఇటీవల విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏమాత్రం సరిపోవని అంటున్నారు. తమ జేబులనుంచి పంచాయతీ అభివృద్ధికి నిధులు ఖర్చుచేయగా, ఇప్పుడు పంచాయతీ అధికారులుకూడా విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీచేయడం బాధాకరమని సర్పంచులు అంటున్నారు.

పుంగనూరులో దారుణం

● జాగా కోసం ఇచ్చిన డబ్బు అడిగిన మహిళను కుమారుడి సహా నిర్బంధించిన రియల్టర్

● 100కు డయల్ చేయడంతో విడిపించిన పోలీసులు

పుంగనూరు, జనవరి 29: నాలుగేళ్లుగా ఇంటి స్థలం ఇస్తానని తీసుకున్న డబ్బును అడిగినందుకు రియల్‌ఎస్టేట్ వ్యాపారి పుంగనూరులో మహిళపై దాడి చేశాడు. కుమారుడి సహా ఆమెను ఇంట్లో నిర్బంధించాడు. దీనిపై బాధితురాలు శిరీష పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన ప్రకారం.. పుంగనూరు కొత్తఇండ్లకు చెందిన మధుసూదన్ భార్య శిరీష, ఇంటి స్థలం కోసం నాలుగేళ్ల క్రితం, మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెకు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆదినారాయణకు రూ.11 లక్షలు ఇచ్చారు. ఎన్నిసార్లు అడిగినా ఆయన ఇంటి స్థలం ఇవ్వలేదు. వాయిదాలు వేస్తూ వచ్చాడు. తమ డబ్బు ఇవ్వాలని, తన కుమారుడికి కాలేజీ ఫీజు కట్టాలని ఆమె రియల్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. తన ఇంటికి వస్తే డబ్బులు ఇస్తానని చెప్పాడు. దీంతో ఆమె ఇంటర్ చదువుతున్న తన కుమారుడు నిఖిల్‌ను వెంటపెట్టుకుని సోమవారం ఉదయం 8 గంటలకు ఉలవలదిన్నెలోని అతడి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆదినారాయణ ఇంటికి రాగా, ఆమె డబ్బు కావాలని అడిగారు. దీంతో అతడు ఆమెపై దౌర్జన్యం చేసి కుమారుడి సహా శిరీషను ఇంటిలోపలకు నెట్టి నిర్బంధించాడు. ఈ ఘటనకు భయాందోళన చెందిన ఆమె.. ఉలవలదిన్నెలో రియల్ ఎస్టేట్ వ్యాపారి తమను నిర్బంధించారని, కాపాడాలంటూ డయల్ 100కు ఫోను చేశారు. పోలీసులు వెళ్లి తలుపులు కొట్టి వారిని బయటకు తీసుకొచ్చారు. తమకు న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదు చేయగా పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైసీపీ ఎమ్మెల్యే బయటపెట్టిన పెద్దిరెడ్డి అక్రమాల చిట్టా

దీనికి సమాధానం ఏం చెబుతారు?

● దళిత కార్పొరేటర్ వద్ద రూ.40 లక్షలు కొట్టేసిన మంత్రి రోజా

● మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శ



మనోహర్ నాయుడికి మృతికి సంతాపం పాటిస్తున్న నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 29: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాల చిట్టాను వాళ్ల పార్టీ ఎమ్మెల్యేనే బయటపెట్టారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు ఎంపీ మిథున్ రెడ్డి జిల్లాలో ఏకంగా దోపిడీ.. లూటీ చేస్తున్నారనేది చంద్రబాబు చెప్పారు. దీనికి ఆయనను రాళ్లతో కొడతామని అంటున్నారు. మరి, సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలం అడిగిన ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారు' అంటూ పెద్దిరెడ్డిని ఆయన ప్రశ్నించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కూడా ఇటీవల పెద్దిరెడ్డి అక్రమాలను బహిరంగంగా ప్రజలకు వివరించారన్నారు. ఆయన్ను రాత్రికిరాత్రే భయపెట్టడంతో వెనక్కుతగ్గారని చెప్పారు. చంద్రబాబును రాళ్లతో కొట్టడం సరే.. ముందు మీ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండంటూ అమర్ సవాల్ చేశారు. జిల్లాలో పెద్దిరెడ్డి మైన్స్, మట్టి, మద్యం, భూములు, ఇసుక అన్నిరకాల దోపిడీ చేస్తూ ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మరోమంత్రి రోజా దళిత కార్పొరేటర్ వద్ద చైర్మన్ పదవి ఆశ చూపి రూ.40 లక్షలు కాజేశారని అన్నారు. సీఎం జగన్ దళితులను అన్ని రకాలుగా మోసం చేస్తున్నారని చెప్పారు. గల్లా కుటుంబం రాజకీయాలనుంచి తప్పుకోవడానికి సీఎం జగన్ ముఖ్యకారణమని చెప్పారు. జిల్లాలో మంత్రులు పెద్దిరెడ్డి, రోజా, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనేక రకాల దోపిడీలు చేసి కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధిస్తుందన్నారు. దళిత ఎమ్మెల్యేలైన ఎంఎస్ బాబు, నారాయణ స్వామి, ఆదిమూలంపై నిందలు వేసి వారిని మోసం చేశారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శించారు. ఈ సమావేశంలో నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, గురజాల జగన్మోహన్, మాపాక్షి వెంకటేష్, కోదండయాదవ్, మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడు మృతికి వీరంతా సంతాపం తెలిపారు.

పెద్దిరెడ్డిని ప్రజలు ఇంటికి పంపడం ఖాయం: చల్లా

పుంగనూరు, జనవరి 29: కుప్పంలో చంద్రబాబు ఓడిపోతారని ఆరోపించడం హాస్యాస్పదమని, ముందు పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలను పుంగనూరులో ఓడించి శాశ్వతంగా ఇంటికి పంపాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతలు పొందిన మాజీ సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి, అర్హత మంత్రి పెద్దిరెడ్డికి లేదన్నారు. చంద్రబాబుపై మంత్రి పెద్దిరెడ్డి ఇష్టమెచ్చినట్లు ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారని, రాళ్లదెబ్బలు తప్పవని మాట్లాడటం దారుణమని ఖండించారు. గత 20 ఏళ్లుగా పెద్దిరెడ్డి కుటుంబం దౌర్జన్యాలు, అరాచకాలు, దాడులు, దోపిడీలలకు పాల్పడుతూ శిఖండి రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు ఇంగ్లీషు మాట్లాడటం రాదని చెప్పడం దారుణమని, ఆయన అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతలు పొందారనే విషయాన్ని గమనించాలని హితవుపలికారు. వైసీపీ ప్రభుత్వానికి ఇక రెండునెలలే గడువని తర్వాత పెద్దిరెడ్డి అరాచకానికి అంతం పలుకుతారన్నారు.

పలమనేరు ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

ప్రమాద స్థితి నుంచి మహిళను కాపాడిన డాక్టర్ శ్యామలాదేవి

పలమనేరు, జనవరి29 : విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతూ సోమవారం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన సుమతి అనే వివాహిత కడుపులో ఉన్న భారీ కణితిని గుర్తించి వెంటనే ఆపరేషన్‌చేసి ఆ మహిళను కాపాడారు. సోమవారం బంగారుపాళ్యంకు చెందిన మోహన్ భార్య సుమతి(32) కడుపునొప్పితో బాధపడుతూ పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంది. వెంటనే వైద్యులు పరీక్షలు చేసి మహిళ కడుపులో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి ఈ కణితిని వెలికి తీయాలని డాక్టర్లు సుమతికి తెలియజేశారు. వెంటనే డాక్టర్ శ్యామలాదేవి సుమతిని ఆపరేషన్ థియేటర్‌కు తరలించి ఆమె కడుపులో ఉన్న కణితిని ఆపరేషన్ ద్వారా వెలికి తీశారు. 25-17 సెంటీమీటర్ల పొడవు, వెడల్పుతో ఉన్న కణితిని తొలగించారు. దీంతో సుమతి ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకొంది.

పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టామని డీపీవో లక్ష్మి సోమవారం తెలిపారు. ఇంటి పన్ను, ఇతర పన్నులను నగదురహిత లావాదేవీల రూపంలో వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో 697 గ్రామ పంచాయతీల్లో క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌కు 252 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 29: చిత్తూరులోని సీటమ్స్‌లో సోమవారం జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకు గాను 252 మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం జరిగిన ఫస్టు షిఫ్టులో 128 మందికి గాను 127 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం షిఫ్టులో 128 మందికి గాను 125 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో తప్పులు దొర్లితే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: ఎన్నికల జాబితాలో మార్పులు- చేర్పులకు సంబంధించి ఎక్కడైనా తప్పులు దొర్లితే చర్యలు తీవ్రంగా ఉంటాయని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల్లోగా ఓటర్ల జాబితా అంశంలో వచ్చిన ప్రతి క్లెయిమ్‌ను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆన్‌లైన్ ద్వారా నివేదిక అందించాలన్నారు. లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉందన్నారు. పత్రికల్లో వస్తున్న వార్తలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మృతిచెందిన, జంక్, డూప్లికేట్ ఓటర్ల జాబితాలపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

52వేల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు రంగం సిద్ధం

52వేల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు రంగం సిద్ధం చేశామని జేసీ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అమరావతి నుంచి సీసీఎల్‌ఏ కార్యదర్శులు సాయిప్రసాద్, ఇంతియాజ్ అన్ని జిల్లాల జేసీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాలిచ్చిన లబ్ధిదారులందరికీ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

'పాచిగుంట'కు కన్నీటి వీడ్కోలు



మనోహర్‌నాయుడు భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న అమర్, నాని తదితరులు

గంగాధరనెల్లూరు, జనవరి 29: తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్‌నాయుడికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం సాయంత్రం వేలూరు సీఎంసీలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి నుంచి ఆయన సొంతూరు పాచిగుంటకు వివిధ పార్టీల నేతలు, బంధుమిత్రులు, స్థానికులు తరలివచ్చి నివాళులు అర్పించారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భౌతికకాయంపై టీడీపీ జెండా కప్పారు. గంగాధరనెల్లూరు, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జిలు డాక్టర్ థామస్, మురళిమోహన్, మరోవైపు రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, మండల నేతలు జ్యోతీశ్వరరెడ్డి, మనోహర్‌నాయుడు తదితరులు పాడె మోశారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తినాని, మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎ.ఎస్.మనోహర్, నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, వైసీపీకి చెందిన ఎన్‌ఆర్‌ఐ ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాంధీ, డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, జనసేనకు చెందిన నియోజకవర్గ జనసేన కన్వీనర్ పొన్నా యుగంధర్, బీజేపీకి చెందిన మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుత్తా ప్రభాకర్‌నాయుడు, జిల్లా బీజేపీ కోశాధికారి హరినాథ్ నాయుడు తదితరులు నివాళులర్పించారు.

తమిళనాడు మాజీ సీఎంకు ఘనస్వాగతం



నగరి, జనవరి 29: తమిళనాడు మాజీ సీఎం పళని స్వామికి నగరిలో ఏఐఏడీఎంకే నాయకులు డాక్టర్ అంబ్రూస్ విల్సన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల వెళుతున్న ఆయన్ను.. ఓంశక్తి ఆలయం వద్ద ఏఐడీఎంకే పతాకాలను, తోరణాలను ఏర్పాటు చేసి శాలువాతో సన్మానించారు. అనంతరం కనుమమిట్ట వద్ద సేలంకు చెందిన క్రషర్ కూలీలు తమ యజమాని కుప్పయ్యశెట్టి ఆధ్వర్యంలో పళనిస్వామికి స్వాగతం పలికారు.

వి.కోట వైసీపీలో ప్రొటోకాల్ వివాదం

వి.కోట, జనవరి 29: వి.కోటలో ఆదివారం జరిగిన ఆసరా సభలో అధికార పార్టీలో ప్రొటోకాల్ వివాదం తెరపైకి వచ్చింది. సభావేదిక వెనుక ఏర్పాటు చేసిన పోస్టర్‌లో తన ఫొటో ఎందుకు వేయలేదో చెప్పాలంటూ ఎంపీపీ యువరాజ్‌ను మండల వైసీపీ కన్వీనర్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ డైరెక్టర్ బాలగురునాథ్ ప్రశ్నించారు. ఇది తాను ఏర్పాటు చేసిన బ్యానర్ కాదని ఎంపీపీ చెప్పగా.. ప్రొటోకాల్ ఎవరిచ్చారంటూ ఎంపీడీవోను అడిగారు. స్థానిక సర్పంచి ఫొటో సైతం ప్రచురించలేదంటూ మరో వర్గం గొడవకు దిగింది. ఇంతలో పార్టీ నేతలు కలగజేసుకుని.. కార్యక్రమం అయ్యాక మాట్లాడుదామంటూ సర్దుబాటు చేశారు. స్థానికుడైన జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఈ సమావేశానికి రాకపోవడం అధికార పార్టీలో చర్చనీయాంశంగా పరిణమించింది. ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తారని ప్రచారం చేసినా.. ఆయన రాకనే సభ ముగించారు. సభ ముగిసిన అరగంటకే మంత్రి వి.కోటలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరుకావడం అధికార పార్టీలో చర్చగా మారింది. వి.కోట వైసీపీలో తారస్థాయికి చేరిన వర్గ విభేదాలు వచ్చే ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.







కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘ నేతలు - దీక్షా శిబిరంలో నిరసన తెలుపుతున్న సెర్ఫ్ ఉద్యోగులు - అర్జీని పరిశీలిస్తున్న డీఆర్వో రాజశేఖర్

పెన్షనర్ల గోడు పట్టించుకోండి

కలెక్టరేట్ వద్ద నిరసన

'స్పందన'లో 277 అర్జీల స్వీకరణ

చిత్తూరు, జనవరి 29: తమ గోడు పట్టించుకోవాలంటూ పెన్షనర్ల సంఘం నేతలు డిమాండు చేశారు. సోమవారం స్పందన కార్యక్రమం సందర్భంగా వీరు కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. అడిషనల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్, 11వ పీఆర్‌సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఆరోగ్య కార్డు ద్వారా గుర్తింపు పొందిన ఆస్పత్రులలో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నేతలు శివకుమార్, ప్రభాకర్ నాయుడు, మురుగానందం, కోదండ, నారాయణస్వామి, కృష్ణమనాయుడు, రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే నుంచి మినహాయించండి

ఏఎన్‌ఎం-3లకు కులగణన సర్వే విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రజారోగ్య, వైద్యశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండు చేశారు. సర్వే కారణంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ఏఎన్‌ఎంలు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు వైద్య సిబ్బందికి మినహాయింపు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోగేశ్వరపిళ్లై, శ్రీనివాసమూర్తి, శివయ్య పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తుకు సమాచారమేదీ?

సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరగా నగరి ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసులు సమాచారం ఇవ్వకపోగా దుర్భాషలాడారని బీసీ విద్యార్థి విభాగం రాయలసీమ అధ్యక్షుడు వాసుకుమార్ ఆరోపించారు. నగరి పరిధిలోని ఎస్సీ హాస్టళ్లలో సక్రమంగా విద్యార్థులకు భోజనాలు పెట్టడం లేదని తెలిసిందని, ఇదే విషయమై కొన్ని వివరాలను అడిగానని తెలిపారు. దరఖాస్తును తీసుకోకపోగా ఆయన గది నుంచి బయటకు వెళ్లమని బెదిరించారని తెలిపారు. అదే రోజు ఆ శాఖ డీడీకి ఫోన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. నగరి ఏఎస్‌డబ్ల్యూపై ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

టైం స్కేల్ వర్తింప చేయండి

డీఆర్‌డీఏ పరిధిలో పనిచేస్తున్న సెర్ఫ్ ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింప చేయాలంటూ ఆ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండు చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరవధిక సమ్మెలో పాల్గొన్న వీరు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయకుండా సీఎం మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీలింగ్ విధానానికి బదులుగా వందశాతం బేసిక్ పే, ఈపీఎఫ్, హెచ్ఆర్ పాలసీ, పదోన్నతులు, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు ఉమాపతి, మోహనకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం

కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలలో రెవెన్యూ శాఖవే ఎక్కువగా ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి 277 మంది హాజరై అర్జీలిచ్చినట్లు డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. ఇందులో రెవెన్యూశాఖకు 243, డీఆర్‌డీఏకు 9, మున్సిపాలిటీలకు 5, విద్యాశాఖకు 4, జిల్లా పరిషత్‌కు 3 వంతున.. మిగిలిన శాఖలకు 13 అర్జీలు అందాయి. బాధితుల సమస్యలను విన్న డీఆర్వో.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పోలీసు స్పందనకు 25 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 25 అర్జీలు అందినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. వేధింపుల కింద 6, భూ తగాదాలు 4, ఆస్తితగాదాలు 4, ఇంటి తగాదాలు 3, కుటుంబ తగాదాలు 3, దారి తగాదాలు 3, వేధింపులు 1, చీటింగ్ కింద ఒకటి వంతున ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సుధాకర్, సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

గాంధీపురంలో వైసీపీ ఎంపీటీసీ భూ కబ్జా

తహసీల్దారుకు ప్రజల ఫిర్యాదు

పుంగనూరు, జనవరి 29: పుంగనూరు సమీపం గాంధీపురంలో గ్రామకంఠం భూమిని వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఆక్రమించారని ప్రజలు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం పుంగనూరు మండలం మోదుగులపల్లె పంచాయతీ భీమగానిపల్లె రెవెన్యూ గ్రామం గాంధీపురంలో సర్వేనంబర్ 265/5లో దాదాపు 1-30 ఎకరాల భూమి గ్రామ కంఠంగా రికార్డుల్లో ఉంది. మూడు రోజులుగా ఎంపీటీసీ సభ్యుడు సురేంద్ర ఆ స్థలాన్ని ఆక్రమించి చదును చేశాడు. గ్రామం నుంచి పొలాలకు వెళ్లడానికి రోడ్డును కూడా చదును చేశారని, గంగమ్మ గుడి దారిలేకుండా, గ్రామానికి తాగునీటి కోసం వేసిన బోరు వద్దకు వెళ్లే మార్గంలేకుండా ఆక్రమించుకుని ప్రహరీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం ఎందుకు ఆక్రమించారని తాము అడిగినందుకు మాపై పోలీసు కేసులు బనాయించి బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదుపై తహసీల్దార్ సీతారాం మాట్లాడుతూ ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పగా గ్రామస్తులు ప్రభుత్వ స్థలం కబ్జాపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌రాజ్, ఆనందాచారి, మోహన్, శ్రీనివాసులు, రమేశ్, హరీష్, శ్రీదేవి, శారద తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యుడు కబ్జా చేసిన స్థలం



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఆపరేషన్ వికటించిందంటూ రాస్తారోకో

నగరి, జనవరి 29: నగరి ఏరియా వైద్యశాలలో చేసిన సిజేరియన్ ఆపరేషన్ వికటించిందంటూ గుండ్రాజకుప్పం దళితవాడవాసులు సోమవారం రోడ్డెక్కారు. దీనిపై బాధితుడు ప్రతాప్ మాట్లాడుతూ.. 'గుండ్రాజకుప్పం దళితవాడకు చెందిన నా భార్య వన్మతిని డెలివరీ కోసం జనవరి 5న ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చాం. తొలుత డ్యూటీలో ఉన్న డాక్టర్లు సాధారణ డెలివరీ అవుతుందని చెప్పారు. ఆ తర్వాత డ్యూటీకి వచ్చిన డాక్టర్ సిజేరియన్ చేయాలన్నారు. ఆపరేషన్ చేసి ఆడబిడ్డను బయటకు తీశారు. ఆపరేషన్ తర్వాత మల, మూత్రాలు రెండూ మూత్రం వచ్చే చోట నుంచి రావడం ప్రారంభమైంది. సిజేరియన్ వల్ల ఇలా వస్తుందేమోనని డాక్టర్‌కు చెప్పాం. పరీక్షలు చేసి, ఎక్స్‌రేలు తీసి సమస్యను మా దృష్టికి తేలేదు. 108 వాహనం ద్వారా ఓ డాక్టర్‌ను పంపి రుయా వైద్యశాలకు పంపారు. అక్కడి వైద్యుల మాటలు విని సందేహం వచ్చి ప్రైవేటుగా స్కాన్ తీయిస్తే సమస్య తెలిసింది. వెంటనే తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి ఆపరేషన్ చేయించాం. మూడునెలల తర్వాత మరో ఆపరేషన్ చేయాలని అక్కడి డాక్టర్లు చెప్పారు' అని వివరించారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వీరు నగరి ఏరియా వైద్యశాలకు చేరుకుని సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యులకు సమాచారం చెప్పారు. జిల్లా అధికారుల దృష్టికి తాము సమస్యను తీసుకెళతామని సూపరింటెండెంట్ తెలిపారు. ఇప్పటికే జిల్లా అధికారులు విచారించి వెళ్లారని, వారి నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలన్నారు అలాకాదు.. వెంటనే డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండు చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. నిరుపేదలైన తాము ఆపరేషన్లను లక్షలాది రూపాయలు వెచ్చించలేమని ఆవేదన చెందారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. వీరి రాస్తారోకోతో వాహనాలు ఆగాయి. సీఐ సురేష్ తన సిబ్బందితో వెళ్లి బాధితులను పక్కకు తప్పించి రాకపోకలను క్లియర్ చేశారు. బాధితులు తిరిగి వైద్యశాలకు వెళ్లే రోడ్డుపై బైఠాయించారు. తాను న్యాయం జరిగేలా చూస్తానని సీఐ హామీ ఇవ్వడంతో బాధితులు ధర్నా విరమించారు.



పసికందుతో రోడ్డుపై బైఠాయించిన బాధితులు

ముగిసిన పోలీసుల ఆటల పోటీలు

చిత్తూరు, జనవరి 29: చిత్తూరులోని జిల్లా పోలీసు మైదానంలో మూడు రోజులుగా జరిగిన పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజున వంద మీటర్ల పరుగు పందెం ఫైనల్ పోటీని కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి జెండా ప్రారంభించారు. అనంతరం మూడు సబ్ డివిజన్ల నుంచి ఆటల పోటీలకు హాజరైన డీపీవో టీమ్, ఆర్మ్డ్ రిజర్వుడు పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వీరికి 800 మీటర్లు, 400 మీటర్లు, 200, 100 మీటర్ల పరుగుపందెంతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, 400 మీటర్ల రిలే, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలలో గెలుపొందిన వారికి ఎస్పీ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవి కుమార్, బాబు ప్రసాద్, విష్ణు రఘువీర్, శ్రావన్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ మురళి, ట్రైనీ డీఎస్పీ పావనకుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



టగ్‌వార్ పోటీల్లో కలెక్టర్ షన్మోహన్

తిరుపతి ఎంపీ సీటుకు కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం / మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. అనంతపురంలో వచ్చే నెల మొదటివారంలో జరగనున్న వైసీపీ 'సిద్ధం' సభ ఏర్పాట్లపై చర్చించేందుకు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సమావేశం జరిగింది.జన సమీకరణ ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్యేలతో, నాయకులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను అవినీతిపరుడో కాదో ప్రజలకు తెలుసునని, ఆదిమూలంపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తిరుపతి ఎంపీగా ఆదిమూలం స్థానంలో కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందన్నారు.టికెట్లు రానివారిని ఇతర పదవులతో సంతృప్తిపరిచేందుకు పార్టీ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రాయలసీమ జిల్లాల్లో అన్ని సీట్లనూ వైసీపీ గెలుచుకుంటుందన్నారు. 'నగరి నియోజకవర్గంలో పనిచేసుకుంటున్న నేను ఒంగోలుకు పోవాల్సిన అవసరం ఏముందో అర్థం కావడంలేదు. ఒకవేళ పార్టీ ఆదేశిస్తే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా సిద్ధమే' అని మంత్రి రోజా అన్నారు. తాను నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నానని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పుణ్యంతో కౌన్సిలర్ అయిన మహిళ ఎవరో చెప్పిన మాటలకు లొంగి తనపై బురద జల్లారని, అలాంటివాళ్లకు భగవంతుడే సమాధానం చెబుతాడన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు కరెక్టు కాదన్నారు. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయని చెప్పడానికి ఆదిమూలం వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి జయరాం,ఎంపీ గోరంట్ల మాధవ్, పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం, నవాజ్ బాషా, తిప్పేస్వామితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నేతలు హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాలతో కొందరు రాలేకపోయారని పెద్దిరెడ్డి చెప్పుకొచ్చారు. తిరుపతిలో సమావేశం జరిగినప్పటికీ స్థానిక నేతలు కన్పించకపోవడాన్ని పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఎంపీ గురుమూర్తి మినహా తక్కినవారు సమావేశంలో కనిపించలేదు.

వైసీపీ నేత దుకాణంలో కర్ణాటక మద్యం సీజ్

అధికారులపై విరుచుపడ్డ వైనం ● కేసు నమోదు చేసిన పోలీసులు



కడపల్లెలోని షాపు వద్ద అధికారులు, వైసీపీ నేతలు

శాంతిపురం, జనవరి 29: శాంతిపురం మండలం కడపల్లెకు చెందిన వైసీపీ నేత దుకాణంలో కర్ణాటక మద్యంను చిత్తూరు ఎక్సైజ్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. కుప్పం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కర్ణాటక మద్యంతో బెల్టు షాపులు జోరుగా సాగుతున్నాయని సమాచారంపై వీరు దాడులు నిర్వహించారు. శాంతిపురం మండలం కడపల్లెలోని వైసీపీ నేత కుప్పం-పలమనేరు జాతీయ రహదారి పక్కనున్న దుకాణంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నటు గుర్తించారు. ఆ షాపులో తనిఖీ చేసి 70 బాటిల్ టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం సీజ్ చేశారు. ఈ విషయం తెలిసి మండల వైసీపీ ముఖ్య నేతలు అక్కడికి చేరుకున్నారు. సీజ్ చేసిన మద్యాన్ని వదిలేయాలంటూ వారిపై దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో కొంతసేపు వాగ్వాదం జరిగింది. వీరు వినకపోవడంతో కుప్పం నియోజకవర్గ ముఖ్య నేతల ద్వారా జిల్లా అధికారులకు ఫోను చేయించినట్లు తెలిసింది. చివరకు జిల్లా అధికారుల ఒత్తిడి మేరకు సీజ్ చేసిన మద్యం బాటిల్లో కొంత అక్కడే వదిలేసి నామమాత్రంగా కొన్ని బాటిళ్లను సీజ్ చేసినట్లు సమాచారం. దీనిపై కుప్పం ఎక్సైజ్ పోలీసులను వివరణ కోరగా.. చిత్తూరు ఎక్సైజ్ స్పెషల్ స్క్వాడ్ వారు దాడులు నిర్వహించి కడపల్లెలో 20 బాటిళ్లు సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

1న జడ్పీ స్థాయిసంఘ సమావేశాలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 29: జిల్లాపరిషత్‌కు సంబంధించి ఐదు స్థాయి సంఘ సమావేశాలు ఫిబ్రవరి ఒకటో తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. జడ్పీ నూతన సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు రెండవ (గ్రామీణాభివృద్ధి), 4వ (విద్య, వైద్యం), మధ్యాహ్నం 3.30 గంటలకు మూడవ (వ్యవసాయం), ఐదవ (మహిళా సంక్షేమం), 6వ (సాంఘిక సంక్షేమం) స్థాయి సంఘ సమావేశాలు.. ఆయా చైర్మన్ల అధ్యక్షతన జరుగుతాయని వివరించారు. ఈ సమావేశాలకు కిందిస్థాయి అధికారులను పంపకుండా పూర్తి వివరాలతో జిల్లా అధికారులే హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా చిట్టిబాబు


చిట్టిబాబు, దామోదరం, కుబుర

కుప్పం, జనవరి 39: ఎస్టీయూ జిల్లా కమిటీలో కుప్పం మండల ఉపాధ్యాయులు కీలక స్థానాలకు ఎంపికయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా పోతుగుంట చిట్టిబాబు, జిల్లా కార్యదర్శిగా హరినాథ్, అదనపు ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, కుప్పం డివిజనల్ కమిటీ కన్వీనర్‌గా దామోదరం, మైనారిటీ కమిటీ సభ్యులుగా కుబుర, ఉపాధ్యాయ వాణి కమిటీ సభ్యులుగా భోగేశ్, కుప్పం డివిజనల్ కో కన్వీనర్‌గా జగదీశ్‌లు ఏకకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటా మోహన్ తెలిపారు. కుప్పం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధోనీ శ్రీనివాసన్, చంద్రశేఖర్, ఇతర నాయకులు కుమార్‌రెడ్డి, సురేశ్, శవరణన్ ఎన్నికైన వారికి అభినందనలు తెలిపారు.

ఎస్టీయూ కార్యవర్గంలో సోమలకు సముచిత స్థానం


జ్యోతీశ్వరుడు, జగన్‌మోహన్‌రెడ్డి

సోమల, జనవరి 29: ఎస్టీయూ నూతన కార్యవర్గంలో సోమల మండలానికి సముచిత స్థానం లభించింది. ఆదివారం చిత్తూరులో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో సోమల హైస్కూల్ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కర్రి జ్యోతీశ్వరుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగాను, నంజంపేట హైస్కూల్ ఉపాధ్యాయుడు జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర కౌన్సిలర్‌గాను, సోమలకు చెందిన సూర్యప్రకాశ్ ఫైనాన్స్ దిడ్డివారిపల్లెకు చెందిన పోకల దేవిక మహిళా కమిటీ కార్యదర్శిగా, వాణి కమిటీకి వహాబ్ సయ్యద్, ఆర్గనైజింగ్ కమిటీకి శెట్టివారి భాస్కర్‌కు జిల్లా కమిటీలో స్థానం లభించడంతో మండలశాఖ అధ్యక్షుడు శివరాం, కార్యదర్శి ఇమ్రాన్, రాంమోహన్ హర్షం వ్యక్తం చేశారు.

కల్లూరు పాఠశాల సందర్శన



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న బాలచైతన్య తదితరులు

కల్లూరు, జనవరి 29: పులిచెర్ల మండలం కల్లూరు పాఠశాలను సోమవారం నేషనల్ గ్రీన్ కార్ప్ జిల్లా సమన్వయకర్త బాలచైతన్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి జాతీయ హరిత అవార్డుకు కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపిక కావడం అమోఘమని తెలిపారు. మొక్కలతో హరిత పాఠశాల ఓ ఉద్యానవనం కావాలన్నారు. అనంతరం గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు, డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, ఎన్సీసీ విద్యార్థులను పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, ఎన్సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయ అభివృద్ధికి రూ.1.23 కోట్లు మంజూరు


ఈవోకు చెక్కు అందజేస్తున్న వీరభద్ర

పలమనేరు, జనవరి28 : పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఎండోమెంట్ శాఖ రూ. 1.23కోట్లు మంజూరు చేసిందని ఆలయ ఈవో కమలాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఆలయ గాలిగోపురం నిర్మాణానికి, పుష్కరిణి, ఆలయ ప్రాంగణ అభివృద్ధికి ఎండోమెంట్ శాఖ రూ. 1.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో ఎండోమెంట్ శాఖ రూ.98 లక్షలు చెల్లిస్తుందని, మిగిలిన మొత్తం ఆలయ కమిటీ దాతలు, స్థానికుల ద్వారా సేకరించి మ్యాచింగ్ గ్రాంటు చెల్లించాల్సి వుంటుందని తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మన్ గంటే వీరభద్ర మ్యాచింగ్ గ్రాంటు కోసం తన వంతు బాధ్యతగా రూ. 5లక్షల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించి చెక్కును ఈవోకు అందజేశారు.

క్రీడాకారులకు బహుమతుల అందజేత



పుంగనూరు రూరల్, జనవరి29: మండల, నియోజకవర్గ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ ఛైర్మన్ నాగరాజరెడ్డి, తహసీల్దార్ సీతారామ్, ఎంపీడీవో నారాయణ, ఏవో రాజేశ్వరి, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



పుంగనూరు రూరల్, జనవరి29: ఇటీవల ఉత్తమ అవార్డులు అందుకున్న అధికారులను ఏపీజే అబ్దుల్‌కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో అవార్డులు అందుకున్న అధికారులు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ సీతారామ్, సీఐ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ దయానందరాజు, అగ్నిమాపక అధికారి సుబ్బరాజు, టీచర్ హేమాద్రిలతో పాటు ప్రజలకు సేవలు అందిస్తున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, న్యాయవాది కుమార్ రెడ్డి, వ్యాపారస్తులు రాము, త్రిమూర్తిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, నాగరాజు, తోట గిరిధర్, సతీశ్‌రాజు, భద్రయ్య, పరమేశ్, రజీఅహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలను ఓటర్లకు వివరించాలి

పుంగనూరు, జనవరి29: తెలుగుదేశం పార్టీ అమలు చేసే పథకాలను ఓటర్లకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రాజంపేట పార్లమెంట్ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి కుమార్ కోరారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన పథకాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలించి ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో క్లస్టర్ ప్రతినిధులు గంగాధర్, ప్రసాద్, నూర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయలు

రొంపిచెర్ల, జనవరి 29 తిరుపతి-మదనపల్లె రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ సమీపం మల్లీశ్వరి డాబా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగేంద్రకు తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి జరిగింది. పీలేరు నుంచి ప్రేమశేఖర్ కారులో తిరుపతికి వెళుతుండగా అదే మార్గంలో తిరుపతి నుంచి పీలేరు మండలం గూడరేవుపల్లెకు చెందిన నాగేంద్ర స్కూటీలో స్వగ్రామానికి వెళుతూ డాబా వద్ద ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన నాగేంద్రను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

పలమనేరు : మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ మీటింగ్ హాల్‌లో జరుగుతుందని కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

ఏళ్ళ నాటి రోడ్డు సమస్య పరిష్కారం

టీడీపీ నేతల చొరవతో రోడ్డు నిర్మాణం, భూమి పూజ చేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, భూములిచ్చిన రైతులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, జనవరి 29 : ఎన్నో ఏళ్లుగా రోడ్డు కోసం ఎదురు చూస్తున్న బండతిప్పనపల్లె గ్రామస్తుల కల సోమవారంతో నెరవేరింది. బండతిప్పనపల్లె నుంచి రాళ్ళబూదుగూరు వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు భూమి పూజ చేశారు. వివరాలు ఇలా... బండతిప్పనపల్లె నుంచి రాళ్ళబూదుగూరుకు పూర్వకాలం నుంచి కాలిబాట ఉండేది. కాలి బాటను రోడ్డుగా మార్చాలని బండతిప్పనపల్లె గ్రామస్తులు కొన్ని ఏళ్ళక్రితం అధికారులకు విన్నవించుకున్నారు. అయితే ఆ కాలిబాట వెంబడి ఉన్న రైతులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఏళ్ళుగా ఆ సమస్య అలాగే ఉండిపోయింది. బండతిప్పనపల్లె గ్రామస్తులు రాళ్ళబూదుగూరుకు, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే కుప్పం - కేజీఎఫ్ రోడ్డుకు వచ్చి సుమారు నాలుగైదు కిలోమీటర్లు తిరుక్కొని వెళ్లి రావాల్సిన పరిస్థితి. ఎంతోమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో రాళ్ళబూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బసవరాజు, వాజీద్, రామప్ప, మురళి, జయరాజ్, ఎంఆర్ నారాయణ, కుమార్, ఇతర టీడీపీ నేతలు కలగజేసుకుని ఆదివారం బండతిప్పనపల్లె - రాళ్ళబూదుగూరుకు వెళ్లే కాలిబాట వెంబడి ఉన్న గ్రామాల రైతులను పిలిపించి మాట్లాడి ఒప్పించారు. దీంతో సోమవారం రైతులు, గ్రామస్తులు, టీడీపీ నేతలతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేసి రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారు. ప్రస్తుతం గ్రావెల్ రోడ్డు చేపట్టి, టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తారు రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు సంతోషం వక్తంచేశారు. అనంతరం రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన రైతులను ఘనంగా సన్మానించారు.

మద్యపాన నిషేధం అంటే ఇదేనా ?

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జనవరి 29 : బెల్టు షాపులు సీజ్ చేసిన పోలీసులపైన వైసీపీ నేతలు దురుసుగా ప్రవర్తించి దాడులు చేయడమేనా మద్యపాన నిషేధం అంటేనని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మండిపడ్డారు. సోమవారం కడపల్లెలో ఎక్సైజ్ పోలీసులు పట్ల వైసీపీ నేతలు ప్రవర్తించిన తీరుపై ఆయన విలకర్లతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఊరూరా వైసీపీ నేతలు, కార్యకర్తలతో బెల్టు షాపులు పెట్టించారని విమర్శించారు. శాంతిపురం మండలంలోని కనమలదొడ్డి, కాళిగానూరు, కడపల్లె, శాంతిపురం, దండికుప్పం, శివరామపురం ఇలా అనేక గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని అనేక మంది మహిళలు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆవేదన చెందారు. అలా కాదని అధికారులు దాడులు చేసి పట్టుకుంటే వెంటనే మంత్రులు, ఎమ్మెల్సీలు ద్వారా ఒత్తిడి చేయించడం, వారి మాట వినకపోతే బెదిరించడం, లేదా ట్రాన్స్‌ఫర్ చేయడం జరుగుతోందన్నారు ఇక కేవలం 70 రోజులు మాత్రమే వైసీపీకి అధికారమని, ఆ తరువాత గాలికి కొట్టుకు పోవడమే ఖాయమన్నారు.

కండీషన్ లేని బస్సులతో ప్రయాణికుల అవస్థలు


గుత్తార్లపల్లె సమీపంలో మరమ్మతులకు గురై ఆగిన బస్సు, ప్రయాణికులు

గుడుపల్లె, జనవరి 29: గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ అధికారులు కండీషన్ లేని బస్సులు నడుపుతుండంతో మార్గమధ్యలో మరమతులకు గురై ప్రయాణికులు అవస్థలు పడడం పరిపాటిగా మారింది. కుప్పం నుంచి గుడుపల్లె మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు నిత్యం ఆర్టీసీ అధికారులు బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులు కాలం చెల్లిపోవడంతో మరమతులకు గురై ఆగిపోతున్నాయి. కుప్పం నుంచి గుడుపల్లెకు ప్రయాణికులను తీసుకొని ఆర్టీసీ బస్సు సోమవారం గుత్తార్లపల్లె దాటిన తరువాత కొంతదూరంలో మరమ్మతులకు గురై ఆగిపోయింది. ప్రయాణికులు బస్సు నుంచి దిగి కొంతమంది కాలినడకన తమ గ్రామాలకు చేరుకోగా, మరికొందరు ఆటోల ద్వారా తమ గ్రామాలకు చేరుకొన్నారు. నిత్యం ఆలా ఆర్టీసీ బస్సులు మార్గ మధ్యంలోనే మరమతులకు గురై ఆగిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామీణ మార్గాల్లో మంచి కండీషన్‌లో ఉండే బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గంలో నలుగురికి చోటు


మెమెంటో అందుకుంటున్న ఎస్టీయూ సభ్యులు

చౌడేపల్లె,జనవరి 29: జిల్లా ఎస్టీయూ కార్యవర్గంలో మండలానికి చెందిన నలుగురు వ్యక్తులకు చోటు దక్కింది. సోమవారం మండల యునియన్ అధ్యక్షుడు లింగమూర్తి మాట్లాడుతూ..రాష్ట్ర కౌన్సిలర్‌గా శ్రీనివాసులు, జిల్లా కార్య దర్శిగా ఆంజనేయులు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామకృష్ణ, సాంస్కృతిక ప్రచార కమిటీ సభ్యుడిగా రవీంద్రను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే సభ్యత్వ నమోదులో జిల్లాలో చౌడేపల్లె మండలం నాలుగోస్థానం సాధించడంతో జిల్లా కార్యవర్గ సభ్యులు మెమెంటోను అందించినట్లు తెలిపారు.

నెల్లిపట్లలో హెల్త్ సెంటర్ తనిఖీ


వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న అధికారులు

బైరెడ్డిపల్లె, జనవరి 29 : మండలంలోని నెల్లిపట్ల గ్రామంలో వున్న హెల్త్ సెంటర్‌ను సోమవారం ఆయుష్మాన్ భారత్ ఉన్నతాధికారులు డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ నిరంజన్‌రెడ్డి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ సెంటర్ ద్వారా గ్రామంలో అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. గ్రామంలో ఆయుష్మాన్ సెంటర్ ద్వారా ప్రజలకు సక్రమంగా వైద్యసేవలందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయచందర్, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీపై విమర్శలు మానుకోండి

- బోస్‌కు టీడీపీ నేతల హితవు

వి.కోట, జనవరి 29: వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీని వీడిన ఆర్వీ సుభాష్‌చంద్రబోస్ తెలుగుదేశం పార్టీపై విమర్శలు మానుకోవాలని వి.కోటలో టీడీపీ నేతలు హితవు పలికారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బోస్ పోటీ చేయగా అందరూ నేతలు ఆయనకోసం కష్టపడ్డారని గుర్తు చేసుకోవాలన్నారు. పదవుల కోసం పార్టీలు వీడేవారు తిరిగి అదే పార్టీపై విమర్శలు చేయడం ఏమేరకు సమంజసమో వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేతలు సోమశేఖర్, రామూర్తిఆచారి, షేక్ ఉమ్మర్, ఉదయ్‌కుమార్, రుహుల్లా, కోదండరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కోసం ఘర్షణ : కేసు నమోదు

పుంగనూరు రూరల్, జనవరి29: సెల్‌ఫోన్ కోసం అన్నదమ్ములు గొడవపడి గాయపడడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కేశవరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు .. మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ షికారిపాళ్యంకు చెందిన బృంద కుమారుడు రూబిన్(22) తన సెల్‌ఫోన్ లాక్ కావడంతో చిన్నాన్న కుమారుడు రవితేజతో చెప్పాడు. సెల్‌ఫోన్ లాక్ అయిందని, తీసి ఇవ్వాలని కోరడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో రూబిన్ గాయపడ్డాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు

చిత్తూరు, జనవరి 29: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు అందినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ గోవర్ధన్ స్పందనలో బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఇందులో మెప్మాకు 02, ప్రజారోగ్య విభాగానికి 03, ఇంజనీరింగ్‌కు 01 అర్జీ వంతున అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా సాయిప్రతాప్ యాదవ్

గుడిపాల, జనవరి 29: చిత్తూరు జిల్లా ఎన్‌వైకేఎస్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా బొమ్మసముద్రం గ్రామానికి చెందిన సాయిప్రసాద్ యాదవ్‌ను సోమవారం నియమించినట్లు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సోమనాథ్ గౌడ్ తెలిపారు. ఎన్‌వైకేఎస్ డైరెక్టర్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్రా ఉత్తర్వుల మేరకు నియమించడం జరిగిందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేవిధంగా మార్గదర్శనం చేసి, యువతకు ఆదర్శం కావాలని కోరారు.

కాణిపాకంలో సంకటహర గణపతి వ్రతం



ఐరాల(కాణిపాకం), జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి అనంతరం కల్యాణ వేదిక వద్ద ఈ వ్రతాన్ని భక్తుల చేత నిర్వహింపజేశారు. అనంతరం రాత్రి సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఏపీ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఐరాల(కాణిపాకం), జనవరి 29: రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి సోమవారం కాణిపాక వినాయకస్వామిని దర్శించుకున్నారు. దర్శనాంతరం ఆమెను వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, డీడీ రాజ్యలక్ష్మీ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన శ్రీనివాస్ సోమవారం రూ.1,00,116లను విరాళంగా అందించారు. విరాళ దాతకు సూపరిండెంటెంట్ కోదండపాణి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం దాతను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందించారు.

పంజాణి టీడీపీ నేతపై వైసీపీ నేత తిట్ల పురాణం

● సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్

వి.కోట, జనవరి 29: పెద్దపంజాణి మండల వైసీపీ అధ్యక్షుడు బాగారెడ్డి, అదే మండలానికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి వేమారెడ్డిని ఫోనులో బండబూతులు తిడుతున్న ఆడియో రికార్డింగ్ సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పెద్దపంజాణి మండలంలో ఇటీవల మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు ప్రభుత్వం మీద పలు విమర్శలు చేశారు. దాన్ని బాగారెడ్డి ఖండించారు. దీంతో వేమారెడ్డి బాగారెడ్డి వ్యాఖ్యల్ని ఖండిస్తూ ఆయనకు వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టారు. దీంతో ఆదివారం వైసీపీ నేత టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీకి కాల్ చేసి మరీ దారుణంగా తిట్టారు.

పలమనేరు మున్సిపల్ కమిషనర్‌గా రమణారెడ్డి



పలమనేరు, జనవరి29 : పలమనేరు మున్సిపల్ కమిషనర్‌గా సోమవారం రమణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కడపలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డిని పలమనేరు కమిషనర్‌గా సీఎండీఏ అధికారులు బదిలీ చేయగా ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను ఆయన పాత ఉద్యోగం హార్టికల్చర్ శాఖకు బదిలీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన రమణారెడ్డికి కిరణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ కూడా పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మంచి నీటి కనెక్షన్

సోమల, జనవరి 29: ప్రతి ఇంటికి మంచి నీటి కనెక్షన్ ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీఎం శివ అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జలజీవన్ మిషన్ కమిటీల ఎంపిక నిర్వహించారు. వెలుగు సంఘాల మహిళలతో 63 కమిటీలను ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అనూష మాట్లాడుతూ ప్రతి ఇంటికి నీటి కనెక్షన్‌కు నాణ్యమైన పరికరాలను వినియోగించాలన్నారు. కమిటీల ఆమోదంతోనే పరికరాలు సరఫరా చేస్తారన్నారు. సమావేశంలో సీసీ గంగోజీ, నరసింహులు, మండల సమాఖ్య ఓబీలు రెడ్డెమ్మ, కోమల, గౌరీ, దేవి, భార్గవి పాల్గొన్నారు.

సోమల కార్యదర్శికి సన్మానం

సోమల, జనవరి29: సోమల పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ ధరణీచంద్ర కుమార్‌కు ఉత్తమ అవార్డు స్వీకరించడంతో వారిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వైస్ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ కష్టంచి పని చేస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కందూరు సర్పంచ్ బాషా మసూద్ పాల్గొన్నారు.

వైసీపీ మండల ఉపాధ్యక్షుడిగా హరినాథ్ రెడ్డి



గుడుపల్లె, జనవరి 29: మండలంలోని పొగురుపల్లెకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డిని మండల ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్సీ భరత్ నియమించారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చారని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వైసీపీ మండల ప్రధాన కార్యదర్శిగా అజయ్ కుమార్ రెడ్డి

రామకుప్పం, జనవరి 29: మండలానికి చెందిన అజయ్‌కుమార్ రెడ్డిని వైసీపీ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శిగా ఎమ్మెల్సీ భరత్ నియమించి నియమకపు పత్రాన్ని అందించారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని ఆయన తెలిపారు.

చంద్రబాబుపై పెద్దిరెడ్డి వ్యాఖ్యలు తగవు

కల్లూరు, జనవరి 29: టీడీపీ అధినేత చంద్రబాబుకు రాళ్ల దెబ్బలు తప్పవనడం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తగదని టీడీపీ రాజంపేట పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు తెలిపారు. పులిచెర్లలో సోమవారం టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. వారు మాట్లాడుతూ మంత్రిగా ఉండి చంద్రబాబుకు రాళ్లదెబ్బలు తప్పవనే వ్యాఖ్యలు చేయడం టీడీపీ కేడర్‌ను రెచ్చగొట్టడం కాదా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయం సాధించి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

రేపు పుంగనూరు మున్సిపల్ సమావేశం

పుంగనూరు రూరల్, జనవరి29: ఈనెల 31న మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా వెంకటరమణ



పుంగనూరు రూరల్, జనవరి29: ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా పుంగనూరు చెందిన ఆర్.వెంకటరమణను ఎంపిక చేశారు. సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఎన్నికలు నిర్వహించగా రాష్ట్రకౌన్సిల్ సభ్యుడిగా వెంకటరమణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కమిటీ కన్వీనర్‌గా మంజుల, జిల్లా సీపీఎస్ కమిటీ సభ్యుడిగా రాజేంద్ర, జిల్లా ఉపాధ్యాయ వాణి కమిటీ సభ్యుడిగా వెంకటేశ్వరబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

కుప్పం, జనవరి 29: కుప్పం పురపాలక సంఘం 9వ వార్డు తెలుగు యువత అధ్యక్షుడు వెంకటాచలం సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుంని భరోసా ఇచ్చారు. మృతుడి కుటుంబానికి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జి మాణిక్యం, మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు టీడీపీ సాయం

రామకుప్పం, జనవరి 29: కెంచనబల్లకు చెందిన గంగప్ప రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఉనిసిగానిపల్లె పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తల్లి లక్ష్మమ్మ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి నారాయణచారి, పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి స్థానిక నేతలతో కలిసి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. పార్టీ తరపున మృతుల కుటుంబాలకు పది వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్ రెడ్డి, గోవిందప్ప, రమేష్, రామలింగా రెడ్డి, జయశంకర్, సత్య, మనేష్, రామలింగం పాల్గొన్నారు.

శాంతిపురం మండలంలో....

శాంతిపురం, జనవరి 29 : చిన్నారిదొడ్డి పంచాయతీ కొండతిమ్మనపల్లెకు చెందిన శివకుమార్, 64 పెద్దూరు గ్రామానికి చెందిన కాంతమ్మ కుటుంబాలకు టీడీపీ తరఫున రూ. 10,000 ఆర్థిక సహాయం చేశారు. మండల నేతలు కొండతిమ్మనపల్లె, 64పెద్దూరు గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, చలపతి, శ్రీనివాసులురెడ్డి, జయప్ప, గంట్లప్ప, శేఖర్ స్వామి, హెచ్ఎం సుబ్రయణ్యం, మురుగేష్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వైభవంగా సంకటహర గణపతి వ్రతం


వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో సోమవారం సంకటహర గణపతి వ్రతాన్ని భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి అనంతరం కల్యాణ వేదిక వద్ద ఈ వ్రతాన్ని భక్తుల చేత నిర్వహింపజేశారు. అనంతరం రాత్రి సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన శ్రీనివాస్ సోమవారం రూ.1,00,116లను విరాళంగా అందించారు. విరాళ దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం దాతను వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందించారు.

పెత్తందారీగా వ్యవహరిస్తున్న పెద్దిరెడ్డి
● పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 29: దళితుల పట్ల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తందారీగా వ్యవహరిస్తూ దళిత ఎమ్మెల్యేలను కాంట్రాక్టు పద్ధతిలో మార్పు చేస్తున్నారని పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ ఆరోపించారు. సోమవారం మండలంలోని తుంబపాళ్యంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవడం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఏకమవ్వాలని, ఈ పెత్తందారీ వ్యవస్థకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. అంతకు ముందు తుంబపాళ్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మురళీమోహన్ నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, సర్పంచ్ ఉషశ్రీ, నాయకులు గురుస్వామి, చిరంజీవి, వెంకటేష్, జనసేన పార్టీ నాయకుడు చిరంజీవి, గోవింద, తిలక్ యాదవ్, జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, హరిప్రసాద్, గిరిబాబు, రంగనాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు


కంటివైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, జనవరి 29: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. తిరుపతికి చెందిన డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు తరచూ కంటి వైద్యపరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవర్ ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రయాణికులందరూ ప్రమాదం బారిన పడతారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, రాజేశ్వరరావు, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాద్ వర్మ, భాగ్యశ్రీ, ఎస్సై రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం


క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి రోజా

నగరి, జనవరి 29: నగరి క్యాంపు కార్యాలయంలో ఆడుదాం.. ఆంధ్ర పోటీలలో గెలుపొందిన నగరి నియోజకవర్గ క్రీడాకారులకు మంత్రి రోజా సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. రూ.33.80 లక్షలతో నింద్ర, విజయపురంలలో జిమ్ నిర్మిస్తున్నామని, రూ.78 లక్షలతో పుత్తూరులో స్కేటింగ్ రింగ్ నిర్మాణంలో ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, పీడీ గోపి, సురేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ స్థాయిలో విజేతగా నిలిచిన పెనుమూరుజట్టును సోమవారం అభినందిస్తున్న ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి తదితరులు - పెనుమూరు


జాతీయస్థాయిలో మధ్యప్రదేశ్ జబల్పూర్ జేఎన్‌కేవీవీ క్యాంపస్‌లో ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం ఆవశ్యకతపై ఐసీఏఆర్, ఏటీఏఆర్ఐ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సెమినార్‌లో చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం దండువారిపల్లికి చెందిన రైతు వై. జగదీశ్వర్‌రెడ్డి పాల్గొని సేంద్రీయ వ్యవసాయంపై ప్రసంగించి ప్రశంసలు అందుకున్నారు - చిత్తూరు (సెంట్రల్)

పెద్దపంజాణి టీడీపీ నేతపై
వైసీపీ నేత తిట్ల పురాణం
● సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్

వి. కోట, జనవరి 29: పెద్దపంజాణి మండల వైసీపీ అధ్యక్షుడు బాగారెడ్డి, అదే మండలానికి చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి వేమారెడ్డిని ఫోనులో బండ బూతులు తిడుతున్న ఆడియో రికార్డింగ్ సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పెద్దపంజాణి మండలంలో ఇటీవల మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు ప్రభుత్వం మీద పలు విమర్శలు చేశారు. దాన్ని బాగారెడ్డి ఖండించారు. దీంతో బాగారెడ్డి వ్యాఖ్యల్ని ఖండిస్తూ ఆయనకు వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో వేమారెడ్డి పోస్టులు పెట్టారు. దీంతో ఆదివారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీకి వైసీపీ నేత కాల్ చేసి మరీ దారుణంగా తిట్టారు.

వరసిద్ధుడి సేవలో
ఏపీ సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ

ఐరాల(కాణిపాకం), జనవరి 29: రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి సోమవారం కాణిపాక వినాయకస్వామిని దర్శించుకున్నారు. దర్శనాంతరం ఆమెను వేద మంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, డీడీ రాజ్యలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి భార్యకు ఆర్థిక సాయం


జ్యోతికి చెక్కును అందిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు, జనవరి 29: విధి నిర్వహణలో ఉంటూ అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు కుటుంబ సభ్యులకు సోమవారం ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందించారు. నగరిలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుబ్బారావు ఈనెల 19వ తేదీన అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి భార్య జ్యోతికి ఐడీఆర్ఎఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును ఎస్పీ అందించారు.

టీడీపీ నేత మృతి

వెదురుకుప్పం, జనవరి 29: వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె మాజీ సర్పంచ్, టీడీపీ నేత కావలి రాజేంద్రన్ (55) మృతి చెందినట్లు కుటుంబీకులు సోమవారం తెలిపారు. ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చనిపోయారని చెప్పారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళీ, నాయకులు బీఎం రవీ, వరప్రసాద్, బుజ్జిబాబు, సంపత్, విజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు వాహనాల వేలం

గుడిపాల, జనవరి 29: మండలంలోని గుడిపాల పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. టీవీఎస్ ఎక్స్ఎల్, స్కూటీ వాహనాలను వేలం వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆసరా చెక్కు పంపిణీ

వెదురుకుప్పం, జనవరి 29: వెదురుకుప్పంలో సోమవారం నిర్వహించిన నాల్గవ విడత ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం నారాయణ స్వామి హాజరయ్యారు. మండలంలో 961 స్వయం సహాయక సంఘాల్లోని 9284 మంది మహిళలకు విడుదలైన రూ.9 కోట్ల 70 లక్షల 38వేలు మెగా చెక్కును ఆయన అందించారు.

టీపీవోగా బాధ్యతలు చేపట్టిన శారద

చిత్తూరు, జనవరి 29: చిత్తూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారిణిగా వి. శారద సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎర్రగుంట్ల పంచాయతీ టీపీవోగా పనిచేస్తున్న శారద బదిలీపై చిత్తూరు నగరపాలక సంస్థకు వచ్చారు. అనంతరం కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు

చిత్తూరు, జనవరి 29: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆరు వినతులు అందినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సహాయ కమిషనర్ గోవర్ధన్ స్పందనలో బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఇందులో మెప్మాకు 02, ప్రజారోగ్య విభాగానికి 03, ఇంజనీరింగ్‌కు 01 అర్జీ వంతున అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, మేనేజర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

1న సామాజిక తనిఖీ బహిరంగ సభ

విజయపురం, జనవరి 29: ఫిబ్రవరి ఒకటిన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు 16వ రౌండ్ ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. మండలంలో డిసెంబరు 28 నుంచి జనవరి 10వ తేదీవరకు గ్రామాల్లో ఏప్రిల్ 2022 నుండి మార్చి 23 వరకు నిర్వహించిన పనులపై వివరాలు సేకరించి, కూలీలతో మాట్లాడారని, పూర్తి వివరాలు బహిరంగ సభలో డీఆర్పీలు వెల్లడిస్తారని తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి

పూతలపట్టు, జనవరి 29: హౌసింగ్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు కోరారు. సోమవారం ఆయన పూతలపట్టు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్ట్రేషన్ ప్రక్రియపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో గౌరి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో...

చిత్తూరు రూరల్, జనవరి 29: చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా పోర్టల్‌లో ఏర్పడిన సమస్యను జేసీకి డీటీ ధనంజయులు వివరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, అప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్, డీటీలను జేసీ ఆదేశించారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, తహసీల్దార్ మురళీమోహన్, డీటీ కిరణ్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, జనవరి 29: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వున్న అన్నాక్యాంటీన్‌లో సోమవారం భాస్కర్ అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు గుంటూరు మురళి, కార్తికేయ చౌదరి, వేణు, హేమాద్రి నాయుడు, హరి, సుబ్బరాజులు, వీరభద్రయ్య, బాలాజీ, పురుషోత్తం, ఏకాంబరం, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి
● నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భాను ప్రకాష్



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గాలి భాను ప్రకాష్

నింద్ర, జనవరి 29: బీసీలకు రాజకీయ పుట్టినిల్లు టీడీపీనేనని, బీసీల అభ్యున్నతి టీడీపీతోనే అని నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. సోమవారం నింద్ర పంచాయతీ మిట్టకండ్రిగ వద్ద నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భానుప్రకాష్ మాట్లాడుతూ జగన్ రెడ్డి, బీసీలు నా వెన్నుముక అని చెప్పి విరిచేశాడని, బీసీలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చి, అధికారాలు ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో చంద్రన్న బీసీల అభివృద్ధికి రూ.2300 కోట్లు మంజూరు చేశారని, జగన్ రెడ్డి నాలుగున్నర సంవత్సర కాలంలో కేవలం రూ.200 కోట్లు మాత్రమే విదిలించారని గుర్తు చేశారు. ఆనందంగా దిగిపోతా అంటున్న జగన్ రెడ్డిని ప్రజలే దించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని చెప్పారు. అనంతరం బీసీలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాబు యాదవ్, కార్యదర్శి విజయకుమార్, పుత్తూరు నాయకులు గంజి మాధవయ్య, షణ్ముగ రెడ్డి, విజయపురం మండల నాయకులు ధనంజయ యాదవ్, ఉదయ్ కుమార్, జనసేన నాయకులు మెరుపుల మహేష్, నింద్ర మండల నాయకులు రవి నాయుడు, చిట్టిబాబు, గాలి రమేష్ నాయుడు, గంగధరం నాయుడు, మురళీ నాయుడు, మణిరెడ్డి, ఆనందరాజు, రఘు యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

బీసీ గర్జన సందర్భంగా గాలి భానుప్రకాష్ సమక్షంలో నింద్ర, పాదిరి పంచాయతీల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి భానుప్రకాష్ పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు.

నర్సింగ్ విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్


స్పృహ తప్పిన విద్యార్థిని బెడ్‌పై పడుకోబెట్టి రోదిస్తున్న విద్యార్థినులు

చిత్తూరు రూరల్, జనవరి 29: నగరంలోని ఓ నర్సింగ్ కళాశాలకు చెందిన 8మంది విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ కావడంతో తోటి విద్యార్థినులు సోమవారం వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆటోలో వచ్చిన వారిని క్యాజువాలిటీలోకి తీసుకొచ్చేందుకు సహాయకులు కానీ, స్ట్రెచ్చర్, కనీసం వీల్ చైర్ కూడా అందుబాటులో లేకపోవడంతో వారిని విద్యార్థినులే మోసుకొచ్చారు. వారికి క్యాజువాలిటీ తెలియక సీటీ స్కానింగ్ వద్ద కూర్చుండిపోయారు. వారిని ఆస్పత్రి సిబ్బంది కానీ, వైద్యులు కానీ పలకరించిన పాపానపోలేదు. చివరకు ఓ రోగి సాయంతో క్యాజువాలిటీకి వెళ్తే... అక్కడ వైద్యుడు ఏమైందని అడిగి వైద్యం అందిచాల్సింది పోయి... ఎవరు మీరు... ఎక్కడి నుంచి వచ్చారు... మీ వార్డెన్ ఎక్కడ అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇంతలోనే ఓ విద్యార్థిని స్పృహ తప్పి పడిపోవడంతో తోటి విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. వారే ఆ విద్యార్థినిని బెడ్ దగ్గరకు తీసుకెళ్లి పడుకోబెట్టి వైద్యుల వద్దకు పరిగెత్తారు. అప్పటికీ అక్కడి వైద్యులు పట్టించుకోలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పీజీ వైద్యుడు వచ్చి అప్పుడు ఏం జరిగిందని వాకబు చేసి వైద్యం అందించారు.

స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి రక్ష



జడ్జి కరుణకుమార్‌ను సన్మానిస్తున్న విజయ్‌కుమార్

చిత్తూరు సిటీ, జనవరి 29: స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి రక్ష అని డీఎల్ఎస్ఏ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ భవన్‌లో గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ పొల్యూషన్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరుణకుమార్ మాట్లాడుతూ మినరల్ వాటర్ కంటే భూమి నుంచి వచ్చే స్వచ్ఛమైన నీరు ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. స్వచ్ఛమైన నీటితో అనేక రకాల జబ్బులు కూడా నయమవుతాయని అన్నారు. ప్రజలు బోరునీటిని వాడటం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, ఈఈ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరిక


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ రాజేశ్వరి తదితరులతో నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 29: వైసీపీ నుంచి సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సోమవారం నగరంలోని 20వ డివిజన్ ఇరువారంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు 'రా.. కదలిరా' కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్, వైసీపీ నేత రాజేశ్వరితోపాటు సుమారు 50 కుటుంబాలు టీడీపీ నేతల ఆధ్వర్యంలో పార్టీలో చేరాయి. టీడీపీ నేతలు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి మోసం చేశారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జగన్ ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. నేతలు సురేంద్రకుమార్, చంద్రప్రకాష్ కటారి హేమలత, గురజాల జగన్‌మోహన్, కాజూరు బాలాజీ, కార్పొరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఎంపీడీవో తదితరులు

నింద్ర, జనవరి 29: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్న నింద్ర మండలం ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ వెంకటేశ్‌ను సోమవారం శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, ఏవో వేణు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలబాలికలను నేరస్తులుగా పరిగణించరాదు
● డీఎల్ఎస్ఏ సెక్రటరీ కరుణకుమార్

చిత్తూరు లీగల్, జనవరి 29: గ్రామీణ ప్రాంతాల్లో వున్న బాలబాలికలను క్రిమినల్స్‌గా నేరస్తులుగా పరిగణించరాదని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. చిత్తూరులోని పాత కోర్టు వద్ద ఆయన డీఎల్ఎస్ఏ భవనంలోని తన చాంబర్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తప్పు చేసిన బాలబాలికలను క్రిమినల్స్‌గా పరిగణించి సాధారణ జైలుకు పంపరాదన్నారు. జువైనల్స్ హోమ్‌కు పంపించాలన్నారు. తద్వారా వారిలో పరివర్తన కలుగుతుందని ఆయన చెప్పారు. పోలీసులు కూడా వారికి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆయన సూచించారు.

క్షుణ్ణంగా ఓటర్ల జాబితా పరిశీలన: ఈఆర్వో


బీఎల్వోలు, ఇతర అధికారులతో మాట్లాడుతున్న ఈఆర్వో చిన్నయ్య

చిత్తూరు, జనవరి 29: పోలింగ్ బూత్ స్థాయిలో తుది ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి పొరబాట్లు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఈఆర్వో చిన్నయ్య అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నియోజకవర్గంలోని బీఎల్వోలు, సూపర్‌వైజరీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు ఉన్నా, పోలింగ్ బూత్ నెంబర్లు మారి ఉన్నా సరిచేయాలన్నారు. గుర్తించిన పొరబాట్లను నిర్దేశించిన ప్రొఫార్మాలో పొందుపరిచి నివేదిక ఇవ్వాలన్నారు. జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నందున దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

● వంద శాతం కుల గణన సర్వే

నగరపాలక పరిధిలో కుల గణన సర్వేను వంద శాతం పూర్తి చేయాలని సహాయ కమిషనర్ గోవర్ధన్ చెప్పారు. కులగణన, పేదలందరికీ ఇల్లు, ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, టాక్స్ వసూళ్లపై అడ్మిన్ కార్యదర్శులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పన్నుల బకాయిలను వేగంగా వసూలు చేయాలన్నారు. సమావేశంలో సీఎంఎం గోపి, సూపర్‌వైజరీ అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చిత్తూరు రూరల్, జనవరి 29: ఎన్నికల్లో పాల్గొంటున్న రాజకీయ పార్టీలు హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని తమ మేనిఫెస్టోలో చేర్చాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్టీయూ కార్యాలయంలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశంలో 45 కోట్ల మందికి పైగా హమాలీ, ముఠా, జట్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారు ఒక్క రోజు పనిచేయకపోతే ఎగుమతులు, దిగుమతులు స్తంభించి పోతాయన్నారు. హమాలీలు కూడా దేశ అభివృద్ధిలో భాగమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు నాగరాజు, గోపీనాథ్, రమాదేవి, మణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా సాయిప్రతాప్ యాదవ్


సాయిప్రతాప్ యాదవ్‌ను సన్మానిస్తున్న చిట్టిబాబు

గుడిపాల, జనవరి 29: చిత్తూరు జిల్లా ఎన్‌వైకేఎస్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా బొమ్మసముద్రం గ్రామానికి చెందిన సాయిప్రసాద్ యాదవ్‌ను సోమవారం నియమించినట్లు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సోమనాథ్ గౌడ్ తెలిపారు. ఎన్‌వైకేఎస్ డైరెక్టర్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్రా ఉత్తర్వుల మేరకు నియమించడం జరిగిందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించే విధంగా మార్గదర్శనం చేసి, యువతకు ఆదర్శం కావాలని కోరారు.

మనోహర్ నాయుడికి ఘన నివాళి


మనోహర్‌నాయుడు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జనం


పాడె మోస్తున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, భీమనేని చిట్టిబాబునాయుడు

గంగాధర నెల్లూరు, జనవరి 29: మండలంలోని పాచిగుంటలో సోమవారం మనోహర్‌నాయుడు మృతదేహం వద్ద వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. టీడీపీ నేతలు దేవపత్ని ధనంజయనాయుడు, రాంబాబు రెడ్డి, వై.వి.రాజేశ్వరి, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, కోదండరెడ్డి, రవి కుమార్, గురసాల కిషన్‌చంద్, రవియాదవ్, నియాజ్‌అలీ, స్వామిదాస్, గంధమనేని జయశంకర్‌నాయుడు, చెంగల్రాయయాదవ్, రుద్రయ్యానాయుడు, మునిరాజులు యాదవ్, జ్యోతియాదవ్, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, పురుషోత్తంనాయుడు, రాము తదితరులున్నారు. అలాగే, వైసీపీ నుంచి గుణశేఖర్‌మొదలి, గుణారెడ్డి, రాజేష్, వేల్కూరుబాబురెడ్డి, రాష్ట్ర పీఆర్‌టీయు వైస్‌ప్రెసిడెంట్ నాగూర్ యువరాజారెడ్డి, ఏకాంబరం, నాయనరెడ్డి, కాంగ్రెస్ నేత చంద్రబాబు, నాగూర్‌పల్లె కొండారెడ్డి, సుధాకర్‌నాయుడు, కాళేపల్లె గోపాల్‌రెడ్డి, బీజేపీ నేతలు రాజేంద్రన్, మురళి తదితరులు నివాళులర్పించారు.


నివాళులు సమర్పిస్తున్న భానుప్రకాష్

నగరి: గంగాధరనెల్లూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్‌నాయుడు అనారోగ్యంతో మృతి చెందడంతో నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, ఉపాధ్యక్షులు ధనంజయలు నాయుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, సురేష్ నాయుడు, పురుషోత్తం నాయుడు తదితరులు కూడా నివాళులర్పించారు.

వెదురుకుప్పం: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడు మృతదేహానికి సోమవారం వెదురుకుప్పం టీడీపీ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షులు గాలి బాబు నాయుడు, వాణిజ్య విభాగం జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షులు బట్టే చాణిక్యప్రతాప్, నేతలు శివరాం యాదవ్, కావలి చక్రీ, మరకాలకుప్పం సుధాకర్, బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఎం.రాజశేఖర్‌వర్మ, మోహన్‌యాదవ్, మునిరాజారెడ్డి, యుగంధర్, మురళీ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మనోహర్ నాయుడి మృతి పార్టీకి తీరని లోటు

గుడిపాల, జనవరి 29: పాచిగుంట మనోహర్ నాయుడు అనారోగ్యంతో మృతిచెందడం టీడీపీకి తీరని లోటని చిత్తూరు పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పార్టీకి తనవంతుగా ఎంతో సేవలు చేశారని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.